


# సెంటిమెంట్

"చేరిమూర్ఖుల మనసు రంజింపరాదు' – అని ఆ మహానుభావుడు ఊరికే అనలేదు.

"ఏమీ తెలీనోడికి జెప్పొచ్చు. బాగా అర్థం చేసుకునేవాడితో చిక్కేలేదు. ఇలా తెలిసీ తెలియని వాళ్ళతోనే తల ప్రాణం తోకకొస్తుంది." మాట వినని కూతురికి నచ్చజెప్పేందుకు ఉపక్రమించిన సావిత్రి మాట ముందుకు సాగలేదు.

"నువ్వు వెయ్యి చెప్పు, లక్ష చెప్పు. నేను ఆ డ్రెస్సు తప్ప వేరేదేదీ వేసుకోను" కరాఖండిగా చెప్పేసింది సాహితి.

"నువ్వు వేసుకోవే. ఆ సంగతి వేరే చెప్పాలా ? నువ్వెవరి కూతురివి ? అభిమాన దుర్యోధనుడిగా పేరుగాంచిన లక్సెట్టి వీరభద్రయ్య గుణగణాలు పుణికి పుచ్చుకున్న మహాతల్లివి. ఆ మహానుభావుడు వేషం వేసి వేసి ఆ లక్షణాలు కూడా సొంతం చేసుకొని, అపర మూర్ఖశిఖామణిగా పేరొందాడు. ఆ పేరు నిలబెట్టకపోతే వంశప్రతిష్ఠ ఏమైపోవాలి.." అప్రతిహతంగా కొనసాగుతున్న సావిత్రి గొంతుకు బ్రేకుపడింది. గుమ్మంలో వీరభద్రయ్య కనబడేసరికి 'కొంపదీసి విన్నాడా యేం ?' అని తనలో తాను గొణుక్కుంటూ పట్టుబడ్డ దొంగలా చల్లగా జారుకుంది.

ఇంట్లో వీరభద్రయ్య కనిపించినంతసేపూ పిల్లిని చూసిన ఎలుకలై పోతారంతా.

"వాళ్ళు పదకొండింటికే వస్తారంటా ?" బయటి నుండి పరిగెత్తుకొచ్చిన రెండో కూతురు స్పందన గుసగుసగా అంది తల్లి దగ్గర.

సావిత్రి గుండె గొంతులోకొచ్చింది. హఠాత్తుగా వెయ్యి ఏనుగుల బరువు మోస్తున్న ఫీలింగ్. గొడ్డుకారం మింగి ఆముదం సీసా ఖాళీ చేసినట్టుంది ఆవిడ స్థితి.

టైమింకా గంటైనా మిగల్లేదు. పనులేవి తెమల్లేదు. బయట పీట మీద ఆయన ఆకలిగొన్న సింహం లాగా కూర్చున్నారు. ఇదేమో ఒహటే మొండి పట్టు పట్టింది.

"అమ్మా ! నాకీ చీర బావుందా ?" కాపర్ సల్ఫేట్ కలర్ పట్టుచీర పట్టు కొచ్చి చూపించింది ఉత్సాహంగా స్పందన.

మరుక్షణమే చెంప ఛెళ్ళుమనిపించింది సావిత్రి. మొదట బిత్తరపోయి, తర్వాత గుర్తుకొచ్చి, ఏడవటం మొదలెట్టింది ఆ అమ్మాయి.

"అసలే టెన్షన్‌తో ఛస్తుంటే, మధ్యలో నీగోలేంటే. అదేమో మూడేళ్ళ కింద తెచ్చుకున్న, చివికి ఆవిరయ్యేందుకు సిద్ధంగా ఉన్న ఆ దరిద్రపుడ్రెస్ తప్ప, వేరే బట్టలే వద్దని మంకు పట్టుబట్టింది. నువ్వేమో టింగురంగా అంటూ పట్టుబట్టలు కట్టుకొని సింగారించుకుంటానంటావ్. ఇంతకూ పెళ్ళిచూపులు నీకా ? దానికా ? ఆ వచ్చినవాడు దాన్నిగాక నిన్నే జేసుకుంటానంటే నేనేం జేసేది ?"

"ఇంకేంటీ చేసేది ? దీనికే ముందు జేసేస్తే అయిపోతుంది."

ఆ మాటలు ముందు కంగారు పెట్టినా, ఆ గొంతు మనసులో అమృతం నింపింది.

ఎప్పుడొచ్చిందో పార్వతి. తన ఆవేదనా గీతానికి ముక్తాయింపు నిచ్చింది.

"రా ! వదినా ! రా ! ఇదేమో..." జరిగిందంతా మళ్ళీ చెప్పబోయింది సావిత్రి.

"నువ్వేమీ చెప్పఖ్ఖర్లేదొదినా ! నేనంతా విన్నాను. సాహితికి నేను నచ్చజెబుతానులే" అంది శాంతంగా.

"ఆ పని చేయొదినా ! చచ్చి నీ కడుపున పుడతాను.

"ఆ ఛాన్సేమీ నీకుండదులే. ఎందుకంటే దాదాపు ఇద్దరమూ ఒకేసారి చస్తాం కాబట్టి." తన సహజ ధోరణిలో చమత్కారమొలికిస్తూ, చేయాల్సిన పనులను సావిత్రీ, స్పందనలకు పురమాయించి, తను సాహితి ఉన్న గదిలోకి వెళ్ళింది.

డ్రెస్సు మార్చుకొమ్మంటూ, ఆ అవసరాన్ని గురించి పది నిమిషాలు ఉద్బోధ చేసింది.

సాంతం ఓపికగా విన్న సాహితి- 'సబ్‌కా సున్‌నా అప్‌నాగానా !' అన్న రీతిలో తాను అదే డ్రెస్సు వేసుకుంటానని తెగేసి చెప్పింది. అందుకు కారణాలను కూడా ఏకరువు పెట్టసాగింది- "ఆంటీ ! నైంటీన్ నైంటీ యెయిట్‌లో నేనీ డ్రెస్ కొన్నాను. అంటే ఆ సంవత్సరంలోని అంకెల మొత్తం కలిపితే ఇరవై ఏడు. అంటే రెండూ ప్లస్ యేడు తొమ్మిది. నా లక్కీ నంబర్ తొమ్మిది. అప్పుడు నా వయస్సు కూడా తొమ్మిదే."

"ఆ.." అవాక్కయ్యింది పార్వతి.

"అదే ఆంటీ ! పద్దెనిమిదిలోని ఒకటీ ఎనిమిది కలిస్తే తొమ్మిది కదా ! విచిత్రంగా ఆరోజు తేది కూడా తొమ్మిది, సెప్టెంబర్. అలా ఎన్ని రకాలుగా చూసినా ఆ రోజు తొమ్మిదే అయ్యేది. మరో అద్భుతం తెలుసా ? ఆరోజు అమ్మ వేసిన తిరగమోత ఘాటుకు స్పందనా నేనూ కలిసి తొమ్మిది తుమ్ములు తుమ్మాం ! ఇలా నా లక్కీనెంబర్ చాలా బలమైందిగా మారింది.

అప్పట్నించీ ఆ డ్రెస్ వేసుకొని నేను ఎక్కడికెళ్ళినా, ఏం చేసినా అంతా సక్సెస్. చివరికి మా అభిమాన హీరోకి లవ్ లెటర్ రాస్తే తొమ్మిది రోజుల్లో రిప్లై వచ్చింది."

"ఇదేం నెంబర్ల పిచ్చే పిచ్చిదానా, గత జన్మలో కొంపదీసి రేసులో, బ్రాకెట్లో ఆడేదా యేం ఈ దయ్యం' మనసులోనే చిరాకు పడ్డది పార్వతి. తను మాత్రం చెప్పుకుపోతోంది సాహితి.

"సెకండియర్ ఎగ్జామ్స్ రాసేటప్పుడు ఇదే డ్రెస్ వేసుకున్నా. నైంటీపర్సెంట్ మార్క్సు వచ్చాయి."

'ఇంకా నయం. మార్కులు బాగా వస్తాయని రోజూ ఉతుక్కోకుండా ఇదే డ్రెస్సేసుకొని వెళ్ళలేదు' బాగా మాట్లాడే పార్వతి కూడా సాహితి ముందు మల్లగుల్లాలు పడసాగింది మనసులోనే.

"ఇప్పటికెనిమిది సంబంధాలయ్యాయి. అమ్మ చెప్పినట్టే రకరకాల చీరెలు కట్టుకుని కూర్చున్నా. ఒక్కటీ కుదిరి చావలేదు. ఇది తొమ్మిదో సంబంధం. ఈ ఒక్కసారికీ ఈ డ్రెస్సు వేసుకుంటాననంటున్నాను. చూశావా, విడ్డూరం కాకపోతే దీనికి సరిగ్గా తొమ్మిది రంధ్రాలు కూడా పడ్డాయి."

'ఓసి వెర్రి పీనుగా, నీకూ తొమ్మిది రంధ్రాలున్నాయి. బహుశా ఈ స్పృహ నీకు లేకపోవడం మేలయినట్టుంది. లేకపోతే ఏ ఘాతుకానికి ఒడిగట్టేదానివో !' పార్వతి అలా అనుకుంటుండగానే పెళ్ళి వారొచ్చిన అలికిడి అయింది-పులిమీద పుట్రలా.

❋ ❋ ❋

"బాబూ ! ఒక్కమాట." షరా మామూలుగా "మా అభిప్రాయాన్ని తర్వాత తెలియజేస్తాం" అంటూ వెళ్ళిపోతున్న వాళ్ళలో చివరనున్న పెళ్ళికొడుకు 'కృష్ణరాయ'ను ఉద్దేశించి చేయితో సైగ చేసింది పార్వతి.

"ఏంటి పిన్నీ !" పాత పరిచయాన్ని పురస్కరించుకొని పార్వతిని ఆప్యాయంగా పలకరించాడు కృష్ణరాయ.

గదిలోకి తీసికెళ్ళి మెల్లిగా చెప్పింది. "అమ్మాయి రూపంలోనూ, గుణంలోనూ, తెలివిలోనూ గొప్పదే. కాని దానిక్కాస్త వెర్రి.."

ఉలిక్కిపడ్డాడు కృష్ణరాయ. "థాంక్స్ ఆంటీ. ఈ ముక్క ముందే చెప్పి పుణ్యం కట్టుకున్నారు. డ్రెస్సు బాలేకున్నా, మొహం జిడ్డుగారుతున్నా- ఆ అందం, అమాయకత్వం నన్నాకర్షించాయి. ఈ మాటొక్కటీ చెప్పకపోతే ఒప్పేసుకునే వాణ్ణే" అంటూ వెళ్ళిపోసాగాడు.

స్పృహలోకి వచ్చిన పార్వతి కృష్ణరాయ చెయ్యి పట్టుకుంది. "అది కాదు నాయనా! దానికి వెర్రి అంటే అది వెర్రిదని కాదు. తొమ్మిది నంబరంటే దాని కిష్టం. ఆ కారణం చేతనే ఆ పాత డ్రెస్సు వేసుక్కూర్చుంది. ఆ విషయంలో పేచి పడటం చేతనే తయారయ్యేంత సమయం కూడా లేక హడావుడిగా అలాగే వచ్చి కూర్చుంది. ఈ ఒక్క విషయంలో నువ్వు కాస్త పెద్ద మనసు చేసుకొని దాన్ని క్షమించాలి. పెళ్ళయితే అదే మారుతుందనుకో.." ఎక్కడ అడ్డు తగుల్తాడో అని పాఠం అప్పజెప్పినట్లు గబగబా చెప్పేసి ఊపిరి పీల్చుకుంది.

ఎగాదిగా చూశాడు. నమ్మలేనట్టు చూశాడు. కళ్ళలోకి చూశాడు. పార్వతి నిజమే చెబుతోందని కన్‌ఫర్మ్ చేసుకున్నాడు.

"అంతేనా !" అన్నాడు చివరగా.

"...."

"అయితే ఓ.కే. నాకు నచ్చేసింది !"

అంటూ ఏదో తలచుకొని నవ్వుతూ గుమ్మం దాటాడు.

❄ ❄ ❄

పట్టు బోర్డర్‌తో, ట్యూబ్‌లైట్ కాంతిలో ధగధగా మెరిసిపోతున్న సిల్క్ చీరలో అప్సరసలా వెలిగిపోతుంది సాహితి.

అసలు-నకిలీని అలవోకగా తెలుసుకోగలిగే సివిల్ ఇంజనీర్ కృష్ణరాయ సాహితి అసలు అందాన్ని తొలి చూపులోనే పసిగట్టేశాడు. కాబట్టి పాత డ్రెస్సులో ఉన్నా, అందంగా అలంకరించుకోకున్నా ఓకే చేసేశాడు.

తాను సాధించిన ఫలితం తన కళ్ళ ముందు సాక్షాత్కరిస్తే తన్మయం చెందుతాడు సాధకుడు. ఆ దేవతను ఆరాధించే భక్తుడే అయ్యాడు కృష్ణరాయ.

లోపల బోల్టు వేసేసి, అపురూపంగా మంచం దగ్గరకు నడిపించుకొని వెళ్ళాడు. పాలగ్లాసు తీసి పక్కన పెడుతుంటే...

"అహహ, మీరు సగం తాగి నాకివ్వండి" అంది అప్పుడే మాటలు నేర్చుకుంటున్నట్టు.

"నాకు పాలు తాగడం అంతగా ఇష్టం వుండదు సాహీ.." ఎలా స్పందిస్తుందోనని కళ్ళలోకి చూశాడు.

"నాకూ ఇష్టం వుండదండీ ! అందుకే అమ్మను బూస్ట్ పెట్టమన్నాను. మొదటిరాత్రి తప్పకుండా చెరిసగం పాలు పంచుకోవాలట. పాలూ నీళ్ళలా కలిసినా, పాలూ-బూస్ట్‌లా కలిసినా ఒకటే కదా !" ఏదో అనుమానం వచ్చి అతని కళ్ళలోకి చూసింది.

ఆమెనే తదేకంగా చూస్తున్న అతని కళ్ళు ఆమె కళ్ళతో కలుసుకున్నాయి. చప్పున తల దించుకుంది. అంతలోనే ఏదో గుర్తుకొచ్చినట్లు దిండు కింద వెతికింది. బూస్ట్ సీసా తీసి పాలలో దట్టంగా కలిపి అందించింది.

గ్లాసుతోపాటు ఆమె చేతిని కూడా తన రెండు చేతులతో పట్టుకుని మధ్య మధ్యలో ఆమెకేసి చూస్తూ సగం పాలు అలవోకగా తాగేశాడు.

మిగిలిన పాలు ఆమె గటగటా తాగేసింది.

సాహితి ప్రతి చర్యనూ గమనిస్తూ ఆనంద వశుడవుతున్నాడు కృష్ణరాయ.

క్షణాలు తుఫాన్ కంటే వేగంగా సాగిపోతున్నాయి.

గడియారం సమయం మీరిపోయిందని హెచ్చరిక చేసింది. (గర్భాదాన ముహూర్తాన్ని అలారంలో సెట్ చేసి ఉంచాడు ముందే అతడు)

మెల్లగా పైటను తీసేయబోతున్న కృష్ణరాయను అడ్డుకుంటూ-

"లైటు తీసెయ్యండి" గుసగుసగా అంది. "బట్ వన్ థింగ్. ఇద్దరమూ ఎవరివి వాళ్ళేవిప్పేసుకోవాలి."

"ఓ.కె." హుషారుగా అంటూ ధోతీ, లాల్చీ, బనియన్ తీసేశాడు.

ఆ స్థితిలో సాహితి అందం తలచుకుంటేనే అతని నరాలు ఉద్వేగంతో 'జివ్వు' మనసాగాయి.

ఏమైనా సరే ఒక్కసారి ఎలక్ట్రానిక్ లైట్ వెన్నెల కాంతిలో ఆ అందాలను తనివితీరా చూడాలని అనుకుంటూ ఆమెకు తెలియకుండా స్విచ్ నొక్కాడు.

"కెవ్వు !"

"కెవ్వు !"

ఇద్దరూ ఒకేసారి అరిచారు.

"నాకు చెప్పకుండా లైట్ వేస్తారా ?" అంటూ బిత్తర చూపులు చూసింది సాహితి.

"శోభనానికి కూడా లోపల ఈ డ్రెస్సు బిగించుకు రావాలా తల్లీ !" అంటూ జుట్టు పీక్కున్నాడు కృష్ణరాయ.

చీరా, జాకెట్టు వెనక ఆ డ్రెస్సునెలా ఇముడ్చుకుందో ఆ ఇంజనీరు మొగుడికి అర్థంగాని పజిల్‌లా మిగిలిపోయింది.

"మరి మీ ఒంటి నిండా ఆ కట్లేమిటండీ ?" పరిశీలనగా చూస్తూ అంది సాహితి.

"ఓ అదా !.." నీళ్ళు నవుల్తూ చెప్పుకొచ్చాడు. "నేనేదైనా ఓ పని చేసే ముందు గైబుస్మాన్ దర్గాకెళ్ళి అక్కడ ఫకీరుతో తాయెత్తు కట్టించుకుంటాను" అంటూ జబ్బలకు, మెళ్ళో, మొలకూ ఉన్న తాయెత్తుల గురించి ఒక్కొక్కటీ చెప్పసాగాడు. "ఇది నేను ఎస్సెస్సీ పరీక్ష రాసినప్పటిది...ఇది ఇంటర్ పరీక్ష... ఇది స్విమ్మింగ్ నేర్చుకున్నప్పటిది... ఇది టూవీలర్ డ్రైవింగ్...." శోషొచ్చేసి పడిపోయింది సాహితి.

**(9-11-2000 ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక)**